# హక్కులడిగితే హత్యలతో జవాబు చెప్తారా!




# ఈ అనాగరికతకు అంతం లేదా?

1985 జూలై 17న కారంచేడులో దళితులపై జరిగిన దాడికి, 2012 జూన్ 12న శ్రీకాకుళం జిల్లా వంగర మండలం లక్షింపేటలో దళితులపై జరిగిన దాడికి మధ్య ఏమైనా తేడా ఉందా?

హంతకులు మారారు తప్ప హతులు వారే. అవే ఆలోచనలు, కక్షలు, నరనరాన జీర్ణించుకుపోయిన వివక్ష, కుల దురహంకారం. ఈ 27 ఏళ్ళలో అవేవీ మారలేదనిపిస్తుంది.

కారంచేడుకి, లక్షింపేట సంఘటనకి మధ్య దళితులపై అత్యాచారాలను నిరోధించడానికి ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989 అమల్లోకి వచ్చినా లక్షింపేట దళితులు దాని నుంచి ఏ మాత్రం ప్రయోజనం పొందలేకపోయారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి, వారి జీవితాలను వికసింపజేయడానికి తీసుకొచ్చిన ఎంతో విలువైన ఈ చట్టాన్ని ప్రభుత్వ అధికారులు అడుగడుగునా అపహాస్యం చేశారు. ఫలితం ఐదుగురు తమ నిండు ప్రాణాలు కోల్పోయారు.

జూన్ 12న లక్ష్మింపేట దళితులపై తూర్పుకాపు కులస్తులు చేసిన దాడి మొదటిది కాదు, గత రెండేళ్లుగా దళితులపై జరుగుతున్న దాడుల పరంపరలో అదొకటి. ఈ విధమైన దాడి జరిగే అవకాశం ఉందని జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి, పోలీసు అధికార్లకు ముందే తెలిసినా దాడిని నివారించడానికి వారు చిన్నమెత్తు ప్రయత్నం కూడా చేయలేదు. పైగా నర్సన్నపేట ఉపఎన్నిక వంకతో లక్ష్మింపేటలో పెట్టిన పోలీసు పికెట్‌ను కూడా జూన్ 10వ తేది రాత్రి తీసేసి దళితులపై దాడి చేయడానికి అవకాశం కల్పించారు.

## అసలు జరిగిందేమిటి?

లక్ష్మింపేట గ్రామంలో వంద మందికి పైగా తూర్పుకాపు కులస్తులు జూన్ 12 ఉదయం 7 గంటలకల్లా కర్రలు, బరిశలు, గొడ్డళ్లతో గుమిగూడటం చూసి ఆ ఊరి మాజీ సర్పంచ్ భర్త చిత్తిరి గంగులు వెంటనే వంగర పోలీసుస్టేషన్ ఎస్.ఐ. సుధాకర్‌కి ఫోన్ చేసి చెప్పారు. స్టేషన్‌లో ఒక్క కానిస్టేబులే ఉన్నాడు, పంపుతున్నానని భరోసా ఇచ్చాడాయన. వంగర పోలీసుస్టేషన్ లక్ష్మింపేటకు 4 కి.మీ. దూరాన ఉంది. మహా అయితే పావుగంట ప్రయాణం. రాజాం నుండి వస్తే ముప్పావుగంట ప్రయాణం. ఎలా చూసినా గంటలోపు పోలీసు బలగాలు రావాల్సింది. కాని పంపాలనే ఆలోచన వారికి లేదు. పంపలేదు. దాడి జరుగుతున్నంతసేపు గంగులు ఫోన్ చేస్తూనే ఉన్నారు. మూడున్నర గంటల తర్వాత 10.30కి గాని పోలీసులు ఊర్లోకి రాలేదు. ఈలోపు జరగాల్సిందంతా జరిగిపోయింది.

అక్కడ పోగైన గుంపులో లక్ష్మింపేట తూర్పుకాపు కులస్తులే కాదు విక్రంపురం, పదమవలస శేఖరపల్లి, బలిజపేట, మద్దివలస గ్రామాలకు చెందిన తూర్పుకాపు కులస్తులు కూడా ఉన్నారు. రాత్రికి రాత్రి కూడబలుక్కుని ఉదయమే మారణాయుధాలతో పోగైన వారందరికీ మొదట కనిపించింది నివర్తి సంగమేసు (40). అప్పుడే ఇంట్లో చల్దన్నం తిని తోబుట్టువు ఇంటికొస్తున్న సంగమేసుని పట్టుకుని ఆమె ఇంటి గుమ్మం ముందే కత్తులతో, బరిశలతో పొడిచారు. అడ్డొచ్చిన తోబుట్టువు సంగమ్మని కూడా కొట్టారు. సంగమేసుని కొడుతుంటే చూసి కొడుతున్నది తన అన్న గంగుల్ని అనుకుని పరిగెత్తుకొచ్చిన చిత్తిరి అప్పుడు (30) కూడా 'మా మీదే కేసులు పెడతారా' అంటూ కొట్టి కొట్టి చంపేశారు.

తర్వాత నివర్తి వెంకటి (51) ఇంటిపై దాడి చేసారు. అతను కొట్టిన గ్రామం వైపు పారిపోతుంటే వెంటబడి ప్రాథమిక పాఠశాల ముందు పట్టుకొని అక్కడే నరికి చంపేశారు. బూరాడ సుందరరావును (40) మంచితనానికి మారు పేరుగా ఊర్లో వారందరూ భావిస్తారు. అతను శ్రీసుందర మల్లిఖార్జున మ్యూజికల్ బ్యాండ్ పార్టీలో సభ్యుడు. బాగా పాటలు పాడటమే కాదు కడుపులోది తీసి ఇతర్లకి పంచిపెట్టే గుణమున్నవాడు. ఆ రోజు ఉదయానే పొరుగూరు పెళ్లిలో పాటలు పాడి తిరిగొచ్చి బట్టలు మార్చుకుంటుండగా అతని ఇంటిపైన పడి కొట్టడం మొదలెట్టారు. నలుగురు వ్యక్తులు అతని కాళ్ల చేతులు పట్టుకుంటే ఇద్దరు అతని ఛాతీపై పెద్ద బండరాయి పడేసి అక్కడికక్కడే చంపేశారు. అడ్డువెళ్లిన భార్యని తూర్పుకాపు కులస్తుల మహిళలు జుట్టు పట్టుకుని బైటికి ఈడ్చుకుని వచ్చి'మా వాళ్ళతో పెట్టుకోవద్దని మొగుళ్లకు చెప్పుకోలేరా మాల లంజలారా' అంటూ చితకబాదారు. బొడ్డూరు పాపయ్య (50) ఆవు తిరుపతిరావు అనే తూర్పు కాపు దగ్గర గతంలో తులం బంగారం దాచుకున్నాడు. అతని ఇంటిపైనపడి 'బంగారం అడుగుతావురా' అని అతన్ని ఇష్టమొచ్చినట్టు కొట్టారు. ఆ దెబ్బలకు అతని మూత్రపిండాలు దెబ్బతిని వారం రోజుల తర్వాత విశాఖ కె.జి. ఆస్పత్రిలో ప్రాణాలు విడిచాడు.

తూర్పుకాపులు పథకం ప్రకారం గుంపులు గుంపులుగా అన్ని వీధుల్లో తిరుగుతూ ఇళ్ళ గడలు, కిటికీలు పగలగొట్టి 'భూములు కావాలా మీకు, ఇప్పుడు దున్నండ్రా'', ''ఒక్కళ్లని చంపినా అదే శిక్ష, పది మందిని చంపినా అదే శిక్ష'', ''మిమ్మల్ని తగలేసి, మీ ఇళ్లల్లో మా పశువుల్ని కడతాంరా'' అని కేకలు పెట్టుకుంటూ ఇళ్లలోకి చొరబడి ముసలీ ముతకా, చిన్నా పెద్దా, ఆడామగా తేడా లేకుండా కొట్టారు. తూర్పు కాపు మగాళ్లు దాడి చేస్తుంటే వాళ్ళ ఆడవాళ్లు కారాలు జల్లడం, దాడిచేస్తున్న వారికి నీళ్లు అందించడం చేశారు. ఈ దాడిలో పాతిక మంది పైగా దళితులు ఆస్పత్రి పాలయ్యారు. మరెంతో మంది ఇళ్లలోనే మంచాన పడ్డారు. ఇప్పటికీ 11 మంది ఆస్పత్రిలోనే ఉన్నారు.

గత రెండేళ్ళలో వాళ్ల మొర ఏ ఒక్కరు ఆలకించి చర్య తీసుకున్నా ఈ దాడిని నివారించే పని. న్యాయం కోసం వారు చేయని ప్రయత్నం లేదు. తొక్కని గడపా లేదు. ఈ వ్యవహారంలో ప్రతి ఒక్క అధికారీ, రాజకీయ నాయకుడూ తూర్పుకాపు కులస్తులకే కాపు కాశారు. తూర్పుకాపులు అవడానికి బి.సి.లే కాని కులాల నిచ్చెనలో దళితుల కన్నా ఒక మెట్టుపైన ఉన్నవారు. పైగా ఈ ప్రాంతంలో రాజకీయ పలుకుబడి గలవారు. పి.సి.సి. అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ ఈ కులానికి చెందిన వాడే.

## ఎక్కడ మొదలయింది

సమస్యను ప్రయోజనాల దృష్టితో చూస్తే కనిపించేవి ప్రయోజనాలే. న్యాయం కాదు. అందుకే మీడియా సహా చాలామంది మొదట దీన్ని గ్రామకక్షలుగా సరిపుచ్చి తేల్చిపారేయాలని చూశారు. లక్ష్మింపేట దళితుల సమస్య భూమి సమస్యా, దళిత ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్యా, నిర్వాసితుల సమస్యా అంటే దాన్ని అలా విడివిడిగా చూడలేం. లక్ష్మింపేట గ్రామంలో తూర్పుకాపు కుటుంబాలు 85 అయితే మాల కుటుంబాలు 79. మిగతా కులాలన్నీ కలిపి మరో 15 కుటుంబాలవాళ్లు జీవిస్తున్నారు. గతంలో వారి ఊరు సువర్ణముఖి నదీ తీరాన ఉండేది. 30 ఏళ్ల క్రితం ఇందిరమ్మ పథకం కింద భూమిలేని దళిత కుటుంబాలకు ఊరిలోని ముత్యాలమ్మ చెరువులో తలా పాతిక సెంట్ల చొప్పున 20 ఎకరాల భూమి కేటాయించింది ప్రభుత్వం. మా పొలాల్లో చాకిరీ చేయాల్సిన వాళ్లు సేద్యం చేయడం ఏమిటని ఆ చెరువుని కావాలని తూర్పుకాపులు నీళ్లతో నింపేసి సాగు చేసుకోనిచ్చేవారు కాదు. అప్పట్లోనే ఒకసారి దళితులను కొట్టారు. ఆ తర్వాత పదేళ్లు ఎవరి భూములు వాళ్ళు సాగుచేసుకుంటూ ఉండిపోయారు.

**లక్ష్మింపేట దళితుల్ని చంపిన తూర్పుకాపుల్ని శిక్షించాలి**

ఇంతలో మడ్డువలస ప్రాజెక్టు వల్ల ముంపుకి గురయ్యే గ్రామాల్లో ప్రభుత్వం భూసేకరణ మొదలుపెట్టింది. ఈ ప్రాజెక్టు వల్ల లక్షింపేట, కొట్టిస, దేవకివాడ, గుడివాడ, మగ్గూరు నరేంద్రపురం గ్రామస్తులు తమ వ్యవసాయ భూములనే కాకుండా ఇళ్లను, ఊరుని కూడా పోగొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుకు సేకరించిన భూమిలో దళితులకు భూమి లేదు కాబట్టి వారికి నష్టపరిహారం ఏమీ దక్కలేదు. ఇళ్లు కోల్పోయినందుకు 8 నుండి 10 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది ప్రభుత్వం. ఇళ్లు, సేద్యపు భూములు కోల్పోయినందుకు తూర్పుకాపు కులస్తులకు ఒక మోస్తరు నష్టపరిహారం లభించింది. నిర్వాసితులైన లక్షింపేట గ్రామస్తులకు గృహనిర్మాణం నిమిత్తం ప్రభుత్వం ముత్యాలమ్మ చెరువు దగ్గర స్థలం ఇచ్చింది. ముందుగా దళితులు వచ్చి అక్కడ ఇళ్లు నిర్మించుకున్నారు. లక్షింపేట తూర్పుకాపు కులస్తులు కొంతమంది నష్టపరిహారం డబ్బుతో ఇతర గ్రామాల్లో పొలాలు కొనుక్కుని అక్కడే స్థిరపడిపోయారు. కొంతమంది ఇతర చోట్ల భూములు కొనుక్కున్నప్పటికీ ప్రభుత్వం ముత్యాలమ్మ చెరువు దగ్గర కేటాయించిన భూమిలో ఇళ్లు నిర్మించుకుని ఉండిపోయారు. దళితులు అక్కడ స్థిరపడిన రెండేళ్లకు కాని వారు అక్కడికి రాలేదు. వారికీ దళితులకీ మధ్య ఒక వీధే అడ్డం.

ఆనాడు మడ్డువలస ప్రాజెక్టు నిర్వాసితుల ఉద్యమానికి నాయకత్వం వహించిన బొత్స వాసుదేవనాయుడు ఈనాడు దళితులపై దాడికి పూనుకున్న కేసులో ప్రధాన ముద్దాయి కావడం గమనార్హం. భూమి ఉన్న వారినే కాదు, భూమి లేని నిరుపేదలను, చేతివృత్తుల వారిని కూడా నిర్వాసితులుగా గుర్తించి, వారికి కూడా నష్టపరిహారం చెల్లించాలనే డిమాండుని ఆనాడు లక్షింపేట దళితులు పెట్టలేదు కాని నిర్వాసితుల సమస్యపై పనిచేసే సంఘాలవాళ్ళు  మాత్రం వారందరికీ కూడా సమగ్ర పునరావాసం కల్పించాలని కోరుతూనే వచ్చారు. దాన్ని ఖాతరు చేయకపోవడం వల్ల సమస్య ఎన్ని వెర్రితలలు వేయగలదో లక్షింపేట దాడే ఒక ఉదాహరణ.

మడ్డువలస ప్రాజెక్టు నిమిత్తం లక్షింపేట గ్రామంలో ప్రభుత్వం సేకరించిన భూమిలో 250 ఎకరాలు ముంపుకు గురికావడం లేదని తేలిం తర్వాత గ్రామస్తులు దానిని సాగు చేసుకోవడం మొదలుపెట్టారు. అందులో 60 ఎకరాలకు సంబంధించిన భూమి యజమానులు ప్రభుత్వం నుండి నష్టపరిహారం పొంది పొరుగూర్లలో స్థిరపడడంతో ఆ 60 ఎకరాలను దళితులు సాగుచేసుకోవడం మొదలుపెట్టారు. ఇది 15 ఏళ్ళుగా జరుగుతోంది. మిగిలిన 190 ఎకరాల భూముల్ని తూర్పు కాపులే సాగు చేసుకుంటున్నారు. అదంతా బంగారం పడే భూమి. సాలీనా రెండు పంటలు పండుతాయి.

## సర్పంచ్ ఎన్నిక కంటగింపైంది

2006లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ఆ గ్రామ సర్పంచ్ పదవిని ఎస్.సి. మహిళకు కేటాయించారు. చిత్తిరి సింహాలమ్మ ఎన్నికయ్యింది. ఒక రకంగా అప్పటి నుండే గొడవ మొదలైంది. సర్పంచ్ అయినా ఆమె మహిళే, దళితే. అందులో తేడా లేదు తూర్పుకాపు పెత్తందార్ల దృష్టిలో. సమావేశాల్లో ఆమెను నిలబెట్టిన సందర్భాలున్నాయి. అయినా ఆమె కొన్ని విషయాల్లో లొంగలేదు. తను చేయదల్చుకున్న పనులు చేసింది. ఇందిరమ్మ ఇళ్లు, సి.సి. రోడ్లు, డ్రైనేజీ కాలువ మొదలైన నిర్మాణ పనులు చేపట్టింది. పింఛన్లు ఇప్పించింది. దీనితో ఆమెపైనా, ఆమెకు సహకరిస్తున్న భర్త గంగులు, మరిది అప్పడులపైనా, మొత్తం లక్షింపేట దళితులందరిపైనా తూర్పుకాపులు కక్ష పెంచుకున్నారు. దొంగ సర్టిఫికెట్లు సృష్టించి వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయించిందని ఎం.ఆర్.ఓ. కార్యాలయంలో ఫిర్యాదుచేసి వాటిని సైతం ఆపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్.ఆర్.ఇ.జి.పి) కింద దళితులకు రావాల్సిన పనులను ఆపించారు. పింఛన్ల మంజూరు కొరకు దళితులు కలెక్టరు కార్యాలయం ముందు ధర్నా చేసినా ఫలితం లేకపోయింది. ఎప్పుడడిగినా విచారణ జరుగుతోందని అంటారట ఎం.డి.ఓ.గారు. విచారణ ఎన్నాళ్లు పడుతుంది? ఏడాదా? రెండేళ్లా? ఈ విషయాల్లో కాలపరిమితి అంటూ ఏమీ ఉండదా?

తమ ఆధిపత్యాన్ని ప్రశ్నించకుండా పడి ఉండాల్సిన వాళ్లు తమ కళ్ల ముందే భూముల్ని సాగు చేసుకోవడం, చదువుకోవడం, సర్పంచ్‌గిరి చేయడం, కొన్ని పథకాల ద్వారా ప్రయోజనాలు పొందటం తూర్పుకాపులకు కంటగింపై అది సూటిపోటి మాటలతో ఆగకుండా క్రమంగా కులం పేరుతో కించపర్చడం, తిట్టడం, కొట్టడానికి దారి తీసింది. జూన్ 12 సంఘటన కంటే ముందు అటువంటి నాలుగు సంఘటనలు జరిగాయి. మొదట దండాసు లత, చిన్నమ్మడు పొలాల్లో పుల్లలేరుకుంటుంటే తూర్పుకాపు కులస్తులు వారిని కులం పేరుతో తిట్టి కొట్టారు. వారు వంగర పోలీసులకి ఫిర్యాదు చేశారు. ఆనాటి డి.ఎస్.పి. సాగర్, సి.ఐ. శశిభూషణ్, ఎస్.ఐ. సత్యనారాయణ కేసు నమోదు చేయకుండా 8 రోజులపాటు దళితుల్ని పోలీసుస్టేషన్ చుట్టూ తిప్పి చివరికి వారి పద్ధతిలో 'సెటిల్' చేశారు. మళ్లీ డి.ఎస్.పి. సాగర్, సి.ఐ. శశిభూషణ్ ఇద్దరూ  దళితులే. ముందు ఆ ముగ్గురు అధికార్లపై చర్య తీసుకోవాలని ఇవాళ లక్షింపేట దళితులు, వాళ్లకు అండగా నిలబడుతున్న అనేక సంఘాలు పెడుతున్న డిమాండ్‌లో మరి న్యాయముందా లేదా?

మరో సంఘటన 2011 ఆగస్టు 22న జరిగింది. నివర్తి రాముడమ్మ, దండాసు లత, కలమర్తి చిన్నమ్మడు అనే దళిత స్త్రీలను పట్టుకుని గంట్యాడ అప్పలనాయుడు, అతని సహచరులు కొట్టారు. రాముడమ్మకు కుట్లు కూడా పడ్డాయి. కొన్నాళ్లు ఆస్పత్రిలో ఉంది. వారు వంగర పోలీసులకి ఫిర్యాదు చేసినా ఏమీ చర్య తీసుకోలేదు. రాముడమ్మ భర్త చిత్తిరి వెంకటినే మొన్నటి దాడిలో తరిమి తరిమి కొట్టి చంపారు. జూన్ 12న చనిపోయిన మరో వ్యక్తి చిత్తిరి అప్పడు వెంకటి మామగారు. మాజీ సర్పంచ్ సింహాలమ్మ మరిది. చంపబడిన మరో మృతుడు బూరాడ సుందరరావు వరసరీత్యా ఆమెకు బాబాయి. ఒక దళిత స్త్రీ మొదటిసారి సర్పంచ్ అయినందుకు ముగ్గురు కుటుంబీకులను కోల్పోయి మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

## దళితుల మనుగడ, ఆత్మగౌరవం ఎప్పటికీ ప్రశ్నార్థకమేనా?

ఇక నాల్గవ సంఘటన 2012 ఏప్రిల్ 11న జరిగింది. చిత్తిరి అప్పడు, అతని భార్య శ్రీదేవి కౌలుకి తీసుకున్న తమ పొలంలో పశువులు పడ్డాయని ఆవు తిరుపతి, గంట్యాడ అప్పనాయుడు, గంట్యాడ వెంకట రమణ, కొనిస చిన్నం నాయుడు, గేదెల కృష్ణమూర్తిలు ''మా మీద కేసులు పెడతార్రా'' అంటూ తిడుతూ వారిపై దాడి చేశారు. అప్పడుని, శ్రీదేవిని, వాళ్ల బాబుని, అప్పడు వదిన అయిన మాజీ సర్పంచ్ సింహాలమ్మను కూడా కొట్టారు. ఈ కేసులో శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదుపై దళితులు పెట్టిన ఒత్తిడి మేరకు ఎట్టకేలకు ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989 కింద కేసు నమోదు చేసి 8 రోజుల తర్వాత నిందితుల్ని అరెస్టు చేశారు. మూడో రోజుకి వాళ్లు బెయిల్‌పై బైటకొచ్చేసారు. (జూన్ 12న జరిగిన మారణకాండలో ఈ ఐదుగురు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.) ఈ గొడవైన తర్వాత గ్రామంలో పోలీసు పికెట్ పెట్టారు. ఇద్దరు ముగ్గురు కానిస్టేబుల్స్ ఆనాటి నుండి జూన్ 10 వరకు గ్రామంలో ఉంటూ వచ్చారు.

## ఆర్థిక అణచివేత

ఒక్క భౌతిక దాడులకు పాల్పడటమే కాదు, తూర్పుకాపులు దళితులను ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నాలు కూడా మొదలెట్టారు. వృద్ధాప్య పింఛన్లను, గ్రామీణ ఉపాధి హామీ పథకాల పనులను ఆపించడమే కాక దళితుల వీధుల్లో బల్బులు లేకుండా చేయడం వంటి వేధింపు చర్యలకు కూడా పాల్పడ్డారు. దళితులు సాగుచేసుకుంటున్న 60 ఎకరాల భూమిలో చొరబడి ట్రాక్టర్లతో దున్నించారు. కలెక్టరుకి ఫిర్యాదు చేస్తే ఇరుపక్షాలపై బైండోవర్ కేసులు పెట్టడంతో మొత్తం వ్యవసాయం ఆగిపోయి భూములన్నీ బీడుపడ్డాయి. మా 190 ఎకరాలు దున్ననీయకుండా చేస్తారా అనే ఉడుకుమోత్తనంతో 30 ఏళ్ల నాడు ప్రభుత్వం ముత్యాలమ్మ చెరువులో దళితులకు ఇచ్చిన 20 ఎకరాల భూమిలో కూడా సాగు చేయడానికి వీల్లేదని తూర్పుకాపులు అడ్డుపడ్డారు. దాంతో అవీ బీడుపడ్డాయి. ఈ 190 ఎకరాలలో తూర్పుకాపులు సాగుచేసుకోలేకపోయినా ఇతర చోట్ల వాళ్ళ భూముల్లో వాళ్లు వ్యవసాయం చేసుకుంటూనే ఉన్నారు.

ఈ విషయాలను దళితుడైన ఆ నియోజకవర్గం శాసనసభ్యుడు, మంత్రి కొండ్రు మురళి దృష్టికి లక్ష్మింపేట దళితులు తీసుకెళ్తే 'ఈ బురదలోకి నన్ను లాగొద్దు' అని చెప్పి పంపేసాడట. అంటే దళితుల జీవనోపాధి సమస్య అతనికి 'బురద'లా అనిపించిందన్నమాట. ఇవన్నీ చూస్తుంటే ఎస్.సి., ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం లక్ష్యం, పరిధి ఒక సగటు లక్ష్మింపేట దళితుడికి అర్థమైనంతగా కూడా ఒక రాష్ట్రమంత్రికి, జిల్లా కలెక్టరు, డి.ఎస్.పి., ఆర్.డి.ఓ., తాసీల్దారు, సి.ఐ., ఎస్.ఐ స్థాయి అధికార్లకు అర్థం కాలేదనుకోవాలా?

అది నిజానికి నీటిపారుదల శాఖ భూమి. ఇరువర్గాలకూ చెందదు. కాని ప్రభుత్వం తల్చుకుంటే దాన్ని రెవెన్యూ భూమిగా మార్చి భూమిలేని పేదలకు పంచడం పెద్ద కష్టమేమీ కాదు. అప్పుడు ఆ భూమిని పొందగలిగే హక్కు మొదట దళితులకే ఉంటుంది. భూసేకరణ చట్టం, దళిత సంక్షేమ పథకాలు, చట్టాలు చదువుకునే కదా వారంతా అధికార్లయ్యింది! న్యాయం చేయాలన్న కోరిక లేకపోయాక ఎన్ని చదివినా ఏం లాభం?

**దళితులకు ఆర్థిక వనరులు కల్పించి తద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. దళితులపై భౌతికదాడులను నివారించడానికి ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్టం, 1989 కింద కేసులు నమోదు చేయడం, అరెస్టు చేయడం మాత్రమే కాదు, అధికార్లు రకరకాల నివారణ చర్యలు కూడా చేపట్టాలి. అనుమానితులు, నిందితులను ఆ ప్రాంతం నుండి బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేయడం, సామూహిక జరిమానా విధించడం వంటి అధికారాలు కలెక్టరు దగ్గర నుండి తాసీల్దారు వరకు అందరు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకూ (ఈ చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం) ఉంది.**

దళితులకు ఆర్థిక వనరులు కల్పించి తద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. దళితులపై భౌతికదాడులను నివారించడానికి ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్టం, 1989 కింద కేసులు నమోదు చేయడం, అరెస్టు చేయడం మాత్రమే కాదు, అధికార్లు రకరకాల నివారణ చర్యలు కూడా చేపట్టాలి. అనుమానితులు, నిందితులను ఆ ప్రాంతం నుండి బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేయడం, సామూహిక జరిమానా విధించడం వంటి అధికారాలు కలెక్టరు దగ్గర నుండి తాసీల్దారు వరకు అందరు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకూ (ఈ చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం) ఉంది. అటువంటి పనులు చేయగల వ్యక్తులకు ఆయుధాల లైసెన్సులు రద్దు చేసి, అవసరమైతే దళితులకు ఆత్మరక్షణ నిమిత్తం ఆయుధాలకు లైసెన్సులు మంజూరు చేయవచ్చని కూడా ఈ చట్టం చెబుతుంది. దళితుల ఫిర్యాదుని రిజిస్టరు చేయకపోతే పోలీసు అధికారికి 6 నెలల దాకా జైలు శిక్ష వేయవచ్చునని కూడా ఆ చట్టంలోని సెక్షన్ 4 అంటుంది.

లక్ష్మింపేట దళితులకు సరైన అర్థంలో న్యాయం జరగాలంటే ఇప్పటికైనా పోలీసులు కేసు దర్యాప్తు సక్రమంగా చేపట్టి నిందితులందరిపై నేరాన్ని రుజువు చేయగల చర్యలన్నీ చేపట్టాలి. శిక్షలు పడేటట్లు చూడాలి. తమ విధులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన పోలీసు, రెవెన్యూ అధికార్లపై ప్రభుత్వం చర్య తీసుకోవాలి. అవసరమైతే సెక్షన్ 4 కింద వారిపై కేసు నమోదు చేయాలి.

అణచివేతకు గురయ్యే ఏ ప్రజలకైనా న్యాయం చేయడానికి అత్యుత్తమ పద్ధతి వారికి సామాజికంగా, ఆర్థికంగా బలం చేకూర్చడం. అప్పుడు అణచివేతను కొంతమేరకైనా వారే ఎదుర్కోగల్గుతారు. అణచివేసే వర్గాలు కూడా కొంత మేరకైనా వెనక్కి తగ్గుతాయి. ఇది జరగాలంటే లక్ష్మింపేట దళితులకు అదే గ్రామంలో భూమి కేటాయించి పట్టాలివ్వాలి. వాళ్లు అదే ఊరిలో ధైర్యంగా, గౌరవంగా, గర్వంగా తలెత్తుకు బ్రతికేందుకు నిందితులను సత్వరమే శిక్షించడంతో సహా అన్ని చర్యలూ తీసుకోవాలి.

30-6-2012

మానవహక్కుల వేదిక
**Human Rights Forum (HRF)**

ప్రచురణ కర్తలు : ఎస్. జీవన్ కుమార్ – 98489 86286, కె.వి. జగన్నాథరావు – 94401 12551